# నేనేం చేయాలి?

లాయర్ దీపావళి సంచిక 1990

నేనేం చేయాలి?

అని ప్రతి పోలీస్ ఆఫీసరు అనుకుంటే ఈ బ్రతుకు భయాలుండవు.

—జయప్రద

"పూర్ణా బయట నుండి వచ్చిన పిలుపు విని బోస్ బాబాయి వచ్చాడంటూ పదిహేను నిమిషాల క్రితం వచ్చి తన హాస్పిటల్‌లో జరిగే ఇన్సిడెన్స్ గురించి చెపుతున్న నా స్నేహితురాలు పద్మకు చెప్పి లేచి పరుగుతీసానంటే బోస్ బాబాయ్‌లో అంత ఆకర్షణ వుంది. ఆయన ముందు చిన్నపిల్లనైపోవచ్చు. ఎన్ని కధలయినా వినచ్చు. ఆయన సర్కిల్ ఇన్‌స్పెక్టర్. వయస్సు నలభయ్ అయిదుకి యాభయ్‌కి మధ్య.

"బాబాయ్!" నేను హిందీ సినిమాలో లాగ అయన్ని కౌగలించు కోలేదు. కనీసం తెలుగు సినిమాలోలాగ చేతులు రెండూ పట్టుకొని నా ఆనందాన్ని వ్యక్తం చేయలేదు. కానీ వీటన్నిటికి మించి నా కళ్ళల్లో సంతోషాన్ని ఆయన గమనించే వుంటారు.

"ఎలా వుందమ్మా నీ ఒంట్లో."

"బాగానే వున్నాను పొట్టమీద మచ్చ మాత్రం మిగిలిపోయింది" అని నవ్వాను

"పోనీలేమ్మా. మచ్చతోపాటు ప్రాణాలు కూడా మిగులుస్తారుగా డాక్టర్లు" డాక్టర్లంటే మహా యిష్టం మా బాబాయ్‌కి అయన బిడ్డల్లో ఒక్కరూ డాక్టర్లు కాలేకపోయారు.

"ఏయ్ పద్మా యిలాగా మీ డాక్టర్లకు మంచి కాంప్లిమెంట్ పారే శారు, మా బాబాయ్ ప్రక్క రూములోకి కేకేసాను.

"నీకాపరేషన్ అన్నరోజు నేను చాలా భయపడ్డాను పూర్ణా...." అభిమానాలు చాలా చిత్రంగా వుంటాయి, నిజానికి నాకాయన అమ్మ తరపున కాని నాన్న తరపున గాని ఏమీకాడు, అంటే ఆయన రక్తమూ నా రక్తమూ ఒకటి కాదన్న మాట ఈ జన ప్రవాహంలో నాకు తటస్థ పడి నాకు ప్రియమైపోయిన వ్యక్తి ఈయన. నాకు రక్తం కలిసిన బాబాయ్‌లు ముగ్గురున్నారు ముగ్గురూ నా అపరేషన్‌రోజు వచ్చి అటెం డెన్స్‌లు వేసి వెళ్ళారు. కాని ఈ సమాజపక్షంగా నాకేమీకాని బోస్ బాబాయ్ కళ్ళల్లో నాకారోజు కన్పించిన తపన వాళ్ళలో నాక్కు కన్పించ లేదు. మాటల్లో తప్ప- నాకప్పుడప్పుడూ నవ్వొస్తుంటుంది. నేను చచ్చి పోతే బాబాయిలు ముగ్గురూ ఎక్కువ ఏడుస్తారా? బోస్ బాబాయి ఎక్కువ ఏడుస్తాడా? అని-చచ్చిపోయాక ఎవరెక్కువ ఏడుస్తారో నా పిచ్చి నేనేం చూడగలను? కానీ బాబాయిలే ఎక్కువ ఏడుస్తారను కుంటా, ఎందుకంటే ఏడ్చేహక్కు వాళ్ళకే ఎక్కువుంది. బోస్‌బాబాయి ఏడిస్తే దానికి లోకానికి నవ్వు, అందులోంచి ఓ అనుమానం. "బాబాయ్

అంటే ఏ వరస?" అని నన్ను చాలామంది అడిగేవారు. తెలియక అడిగితే ఫిలీడీకరించేదాన్ని. తెలిసి అడిగినవాళ్ళకి ఒళ్ళుమండి 'స్నేహితుడు' అని చెప్పేదాన్ని అలా చెపితే అమ్మకు చాలా కోపంవచ్చేది, స్నేహితుడేమిటి! విన్నవాళ్ళు ఏమనుకుంటారూ అని రూమ్‌లో నుండి పద్మ వచ్చింది బాబాయికి పరిచయం చేసాను. ఆమె ప్రైవేట్ ప్రాక్టీస్ వివర్గాలు అడిగారు అంటే కుశలం అడిగారన్న మాట. ఆ తర్వాత నా వైపు తిరిగి "చిక్కిపోయావు పూర్ణా" అన్నాడు. నిజానికి నేను లావెక్కాను. నేను బాబాయికి అతని దృష్టిదోషాన్ని ఎత్తిచూపే లోపలే మా అరుణ వచ్చింది. నాకంటే పదేళ్ళు చిన్నదయిన అరుణ నా స్నేహితురాలు. దశాబ్దం తేడావున్నా భావాల్లో తేడాలు లేవు మేమిద్దరం వరసలు పెట్టుకోవల్సిన్న అవసరం లేదు ఒకే సెక్స్ కదా!

"రామ్మా! రా" మొదట మా బాబాయే చూచి ఆహ్వానించారు.

"మీరెప్పుడొచ్చారు అంకుల్" అంటూ వచ్చి నా ప్రక్కన కూర్చుంది అరుణ.

"న్యాయంగా నేను నీతో మాట్లాడకూడదు" అన్నాను నేను. అరుణ రాకపట్ల నా ఆనందాన్ని దాచుకుంటూ పైకి కోపంగా..

"అదేం" చిత్రంగా కళ్ళు తిప్పుతూ అని మా పద్మవైపు చూపు తిప్పింది. ఆ పిల్ల కళ్ళు చాలా పెద్దవి, పైగా చాలా అందంగా వుంటాయి.

"మీరొచ్చి చాలా సేపయిందా."

ఇప్పుడే అని పద్మ మా ఇద్దరి తగువును ముచ్చటగా చూస్తోంది.

"నువ్వెన్ని" రోజులయిందినన్ను చూడనువచ్చి, నా అలిగేషన్ని బయటపెట్టాను.

"సారీ పూర్ణా నీ ఆపరేషన్ అయిన వారానికి మా ఇంట్లో దొంగలుపడ్డారు. అంతంత మాత్రం కుటుంబాలు కదా! ఆ దిగుల్లో—

"దొంగలు పడ్డారా? రిపోర్టిచ్చావా?" అన్నారు బాబాయి ప్రొఫెషనల్ భాషలో.

"ఏమిటి లాభం బాబాయ్ మేము రిపోర్టులివ్వడం, కొందరు తప్పించుకున్నా కొందర్ని మీరు పట్టుకోవడం వాళ్ళు దొంగిలించిన బంగారంలో సగం మీ చేతికొస్తే ఆ సగంలో మీకు పోను కొంత బంగారం మా మొహాన కొట్టడం. సారీ బాబాయ్ ఈ చురుకు మీ మీద కాదు. ఏం చెపుతున్నానూ ఆ తర్వాత వాళ్ళను వదిలేయడం వాళ్ళు మరో గృహ ప్రవేశం చేయటం....అసలు దొంగతనాలు జరక్కుండా చూడాలిగానీ జరిగిన తర్వాత వాళ్ళను పట్టుకోవడం, వదిలేయడం మరలా పట్టుకోవడం....వాళ్ళ శరీరంమీద దెబ్బలు, మనసులుమారడం. మరలా మొదలు" (రాళ్ళలా) పక పక నవ్వారాయన.

"నిజమే నిజమే నువ్వు చెప్పింది నిజమే" అన్నారు తర్వాత సాలోచనగా.

"నిజమేననకపోతే పద్ధతి మార్చేయకూడదూ బాబాయ్."

"మార్చాలమ్మా కానీ ఎలా?" కాఫీ సిప్ చేస్తూ అడిగారాయన.

"ఎలా ఏవిటి అంకుల్ ఇలా చేసిన వాళ్ళని నలుగుర్ని ఉరితీస్తే చాలు మిగతావాళ్ళు భయపడిపోతారు" ఈ మధ్యనే ఎంతో కొంత నష్టపడిన అరుణ ఆవేశం ఆమెచేత అలా మాట్లాడించింది.

"అవి ప్రాణాలు గదమ్మా మరలా రమ్మంటే రావు కదమ్మా" నాకందుకే బాబాయి అంటే చాలా ఇష్టం. ఆ డిపార్టుమెంటులో వుండకూడని కరుణ ఆయనలో వుంది.

"ప్రాణాలు కాకపోయినా ఏ కాలో చెయ్యో అయినా తీసేయాలి. లేకపోతే చూడంకుల్ ప్రజలు ప్రాణాలు ఎలా అరచేతిలో పెట్టుకుని బ్రతుకుతున్నారో!

"నిజమేనమ్మా మనం కాస్త జాగ్రత్తగానే వుండాలి. అవునూ అరుణా! అసలా దొంగ ఇంట్లోకెలా వచ్చాడమ్మా" కప్పు టీపాయిమీద పెడుతూ అడిగారు.

రైట్ రాయల్‌గా బెల్ కొట్టారంకుల్ మావారారోజు ఆఫీసు నుండి కాస్త పొద్దుపోయి వస్తానన్నారు ఆయనే అనుకుని తీసాను. చిన్న తరహా దొంగలేపాపం నగలే తీసుకెళ్ళారు మా ప్రాణాలతో వెళ్ళకుండా.

"పేపరు చూస్తూనే వున్నావు కదమ్మా నువ్వు తలుపు తీయకుండా వుండాల్సింది."

నాకు నవ్వొచ్చింది నవ్వుతూ మా పద్మవైపు చూసాను.

"భలే బాబాయ్ మీ సలహాకు ముందే మా పద్మ ఇదే పని చేసింది. ఆ రోజు నేనక్కడే వున్నాను" చెప్పాలనుకున్నది చెప్పక ముందే నాకు నవ్వాగలేదు.

అంత నవ్వడానికేముందక్కడ? చిన్నబుచ్చుకొంటూ అంది మా పద్మ డాక్టర్ వృత్తి ఎలా చేస్తుందోకానీ ప్రతి చిన్నదానికీ అఫెండ్ అయిపోతుంది.

"వస్తున్నా చెప్పనీ బాబాయి ఆ రోజు శ్రీధర్‌గారు అదే మా పద్మ హస్బెండ్ ఊరిలో లేడు, మరీ మరీ జాగ్రత్తలు చెప్పి నన్ను తోడువుంచి వెళ్ళారాయన. ఆ రోజు అర్ధరాత్రి పెద్ద సీను-

"ఏవి జరిగిందమ్మా?"

"అర్ధరాత్రి ఆడపిల్ల పుట్టింది" జోక్ విసిరాను.

"అర్ధరాత్రిళ్ళు ఆడపిల్లలు చాలామంది పుడ్తుంటారులే అసలు విషయం చెప్పు" అరుణ విసుక్కుంది.

నేను చెప్పడం మొదలెట్టాను.

"ఆ రోజు గాఢనిద్రతో వున్నామా? పైకి బెల్లు. మా పద్మతో పాటు నేనూ కళ్ళు నులుముకుంటూ దిగాను. నైట్ డ్యూటీ నర్సు లిద్దరు, ఒక అయా వెయిటింగ్ హాల్లో బిక్కుబిక్కుమని నిల్చొని వున్నారు. హాలు కిటికీకవతల ఆరుమంది బలిష్ఠులైన మగాళ్ళు తలుపు తీయమని గొడవ బెడ్తున్నారు. డాక్టర్‌గారి పర్మిషన్ తీసుకుని తలుపు తీయాలని వీళ్ళు– ఎంత సేపని బయట నిలబడాలని అవతలివాళ్ళూ-"

కిటికీలోనుండి తొంగిచూసి 'పేషంటేది' అని అడిగింది డాక్టరమ్మ. ఆరుమందీ కిటికీ పక్కకు తొలిగి ఒకామెను ముందుకు లాక్కొచ్చారు. ఆమె మెలికలు తిరిగిపోతూ బిడ్డనొప్పులు పడుతుంది.

'పాపం తలుపు తీయండి' అన్నాను నేను జాలిపడిపోతూ....

ఉండు పూర్ణా ఆడతోడు లేకుండా ఒక్క పేషంటే వచ్చిందంటే నాకు నమ్మబుద్ధి కావడంలేదు. ఆ పొట్టకూడా అలా అనిపించడంలేదు. అంది చిన్నగా నాతో.

నాకర్థం కాలేదు కాని విషయం ఈమెకర్థమయింది. ఆ తర్వాత ఆ తర్వాతేమన్నావు పద్మా....

పద్మ జవాబివ్వలేదు. సిగ్గుపడినట్టు తలొంచుకుంది.

"ఆ....ఆ గుర్తు వచ్చింది నన్ను పక్కకు లాక్కెళ్ళి అంది. మగాడికి వేషంవేసి తీసుకొచ్చినట్టున్నారు."

"అవునమ్మా ఈమధ్య హాస్పిటల్స్‌ని బాగానేదో చేస్తున్నారు."నర్స్ వంత పాడింది.

నేను చప్పున తొంగి చూశాను. నిజమే ఆమె ముఖంకూడా కాస్త రఫ్‌గా మొరటుగా వుంది. నేనేం జవాబు చెప్పలేదు.

"అమ్మోయ్ బాబోయ్ నాకేదో అయిపోతుందిరో" బయట ఆమె అరుస్తోంది గొంతు కీచుగా వుంది. ఆమె ప్రక్కనున్న యువకుడొకడికి చాలా కోపం వచ్చింది కదూ పద్మా.

"అసలేం జరిగిందో చెప్పకుండా" అరుణకు క్యూరియాసిటీ.

"ఇంకేముంది చెప్పడానికి? తలుపులు తీస్తారా బద్దలు కొట్టమంటారా" అని అతను అరుస్తున్నాడు.

'తలుపు తీయనా అమ్మ' అని నర్సులు అడుగుతున్నారు.

ఏదో నిర్ణయించుకోలేని స్థితిలో ఈ పిచ్చితల్లి....యింతలో కేర్ కేర్ మని శబ్దం.-

అర్ధరాత్రి ఆడపిల్ల వీధిలో పుట్టేసింది. అప్పుడు చూడాలి మా చిట్టి డాక్టరమ్మ ముఖం-

ఈసారి నవ్వేసింది పద్మ. బాబాయ్ కూడా పడీపడీ నవ్వారు.

ఇంతకీ కాన్పేనా? "నేనింకా దొంగలనే అనుకున్నాను" అంది అరుణ.

"ఆమె తండ్రి డిశ్చార్జ్ అయ్యేదాకా, నేను కనిపించినప్పుడల్లా చెప్తూనే వున్నాడు. ఆ వారంరోజులు నా ప్రాణాలు తోడేశారు. కుట్లు నొప్పి పుట్టినా, పిల్లది తుమ్మినా ప్రతిదానికీ సవ్యంగా కాన్పు చేయని నా నిర్లక్ష్యానికి ముడి పెట్టేవాళ్ళు" అని నవ్వింది పద్మ.

"చెప్పేయక పోయావమ్మా నీ భయాన్ని" బాబాయ్ నవ్వుతూనే అన్నారు.

"అబ్బే! వాళ్ళు వెళ్ళి నలుగురికి చెప్పుకోరూ...." అసలు అసహ్యానికి భయపడకుండా చెప్పినా పోయేది. నా తల వాచిపోయేది కాదు.

"అతని అక్కసు అతనిది" అని మరలా నవ్వాను నేను.

"అక్కసేమిటి?" అరుణ కోపంగా అడిగింది.

డాక్టరుగారు కావాలని వాళ్ళను భయపెట్టారా ఏమి? రోజులలా వుండే.

"నిజమే బాబాయ్ మనింట్లో జరగక పోయినా ఈ నిముషమో మరు నిముషమో! మనకి తప్ప అనునంత రక్షణ లేకుండా వున్నాయి రోజులు" అని జత చేశాను ఆవేశంగా నేను.

"రక్షణ లేదనకు తల్లీ మా డిపార్టుమెంటు పనిచేస్తోంది. కానీ చూడు ఇలా కేస్ వస్తుందా మరో ప్రక్కనుండి ఏ యం.యల్ ఏ నో ఫోన్ చేస్తారు. 'వాడు మనకు కావలసిన వాడు వదిలేయండి' అని-వాళ్ళను వదలకపోతే మేము మా ఉద్యోగాలు వదులుకోవాలి."

"రబ్బిష్! ఆఫ్టాల్ ఈ రోజుండి రేపు తీసేయబడేవాళ్ళు వాళ్ళకు భయపడేదేమిటి మీరు?" అన్నాను రాజకీయపు పవర్ తెలియని నేను.

నవ్వి సరిపెట్టబోయి మరలా మనసు మార్చుకున్నట్టుగా అన్నారు "ఈ రాజకీయ నాయకుల బాసిజమ్ మామీద లేకపోతే మా డిపార్టుమెంటుమీద యిన్ని అపవాదులు పడేవి కావమ్మా"

"నిజమేననుకోండి...." పద్మ ఏదో చెప్పబోయి ఆగిపోయింది.

"చెప్పమ్మా నువ్వేం చెప్పాలనుకుంటున్నావో నిస్సంకోచంగా చెప్పు"

"మీ డిపార్టుమెంట్ మీద కూడా అపవాదులున్నాయనుకోండి-" మరలా సంకోచంగా ఆగిపోయిందామె.

ఆమెకు మా బోస్ బాబాయ్ కొత్త. కానీ ఆమె అనుకున్నట్టు బోస్ బాబాయ్ చిన్నబుచ్చుకోలేదు. నవ్వుతూ అన్నారు "నువ్వు చెప్పాలనుకున్నదేమిటో నాకు తెలుసమ్మా.... నువ్వనుకున్నట్టు మా డిపార్టుమెంటులో కొన్ని కలుపు మొక్కలుంటూనే వున్నాయి. వాళ్ళని లంచ గొండులుగా చేస్తున్నది కూడా నేరస్థులే. వాళ్ళకు మద్దత్తు రాజకీయం" నిట్టూర్చారాయన సుదీర్ఘమైన సంభాషణ తరువాత మొదటిసారిగా.

కొంతమంది నిజాయితీగా వుండి తీరాలి బాబాయ్. "మీరు,

గవర్నమెంటు డాక్టర్లు. జడ్జి ముఖ్యంగా....ఎందుకంటే బాబాయ్ మీ దయ మీద, నిర్ణయం మీద చాలామంది బ్రతుకులు ఆధారపడి వుంటా యెక్కడ"

"ఇలాటి వాళ్ళకు పెద్ద జీతాలిస్తే....నిజాయితీగా వుండటానికి అవకాశముంది ఏమంటారు మీరు?" అంది అరుణ.

"లేదమ్మా జీతాలతోపాటు లంచాలూ కావాలి. అది వాళ్ళ మన సుల్లో వుండాలిగానీ....ఎవరూ అలాటి వారిని మార్చలేరు."

"మార్చలేరంటారా?" అని నిరాశ పడ్డాను.

"ప్రలోభాలు పోతేగాని లంచగొండితనం పోదు."

ప్రలోభాలంటే....

ప్రలోభాలంటే ఆకర్షణలు....ఇదే కదమ్మా చాలామందిని దొంగ లుగా మారుస్తున్నది.

"ఎలాగయినా సుఖపడాలి" అనే తత్వం ప్రజల్లో ఇదివరకులేదు. హఠాత్తుగా గొప్పవాళ్ళయిపోయి అల్రెడీ గొప్పవాళ్ళుగా వున్న జనాలు అనుభవించే ఈ సుఖాలన్నీ అనుభవించాలనే దురాశ మనుషుల్ని లంచ గొండులుగా- దొంగలుగా మారుస్తోంది." తన థీసీస్ మాముందుం చారు బాబాయ్.

"అదీగాక అంకుల్ ఈ సినిమాలు సగం నేర్పిస్తున్నాయి. ఎలా దొంగతనం చేయాలో అని పాఠాలు చెపుతున్నాయి" కసిగా అంది అరుణ. పోయిన నగలు ఆమె కళ్ళముందు కన్పించి వుంటాయి.

"మొన్నొక సినిమా చూశాను ఓ పదిరోజుల ముందు అదేమి సిని మాబ్బా....!" ఆలోచిస్తోంది అరుణ.

"నెలకి ఓ వంద సినిమాలన్నా టౌన్‌లో ఆడతాయి. నువ్వు నూన్‌షోలు కూడా వదలకు పోతివి. పైగా వీడియోలు కొన్ని. నీకు

పేరులేమి గుర్తుంటాయికానీ" అని చిన్న జోక్‌వేసి వాతావరణాన్ని కొద్దిగా కూల్‌డౌన్ చేశాననుకున్నాను.

"ఆ గుర్తు వచ్చింది 'మరో ప్రేమకథ' ఆ సినిమాలో హీరోగారి ఉద్యోగం ఒక చిన్న పుస్తకాల షాపు ఓనరో, వర్కరో. ఇల్లు మాత్రం ఐదారువేల ఉద్యోగస్థుడు కూడా మెయిన్‌టెయిన్ చేయలేనంతది. అలాంటివి చూసినప్పుడు లేనివారు కూడా ఆకర్షించబడుతున్నారు. ప్రలోభం అర్ దొంగతనం అలాటి ఇల్లు కట్టుకోవాలనిపిస్తుంది. నిజమా, కాదా!" నా వైపు తిరిగింది అరుణ.

"కారణం ఏదయినా కానీ దీనికి పరిష్కారం కావాలి బాబాయ్" జవాబు చెప్పకుండా బాబాయ్‌నడిగాను.

పరిష్కారం కావాలమ్మా. కానీ....పూర్ణా ఈ మధ్య జరిగిన ఓ సంఘటన చెప్పనా? చెప్పండన్నట్టు అందరం కుతూహలంగా చూసాం.

"మొన్నొకరోజు ఒక కేడీని పట్టుకున్నాము. వెంటనే 80 ఏళ్ళ వృద్ధురాలిని కొందరు మోసుకొచ్చారు. ఆమె రావడంతోనే నా కాళ్ళను చుట్టేసింది.

"దొరా! నా బిడ్డనొదులు. నా ప్రాణాలు తీసుకో. వాడు లేందే నేను బతకలేనయ్యా" గొల్లున ఏడ్చింది.

"బాబుగారూ! బుద్ధి పొరపాటై గడ్డి తిన్నాడు. వాడిక యిలాటి పనులు చేయకుండా చూసే పూచీమాది. వాడుతప్ప ఈ ముసలిదానికి మరో ఆధారంలేదు" అన్నారు చుట్టూ వచ్చిన జనం.

"అప్పుడు నేనేం చేయాలి పూర్ణా! వాడిని ఉరి తీయాలా?"

"మీ డిపార్టుమెంట్‌కు అంత దయ పనికిరాదు బాబాయ్"

"ఇది దయకాదమ్మా.... కొద్ది ముందుకెళ్ళి ఆలోచిస్తేఅనిపిస్తుంది వాళ్ళను మార్చాలిగానీ, వాడిని ఉరి తీస్తే....

వాడొక్కడి బ్రతుకు అంతమైపోదు, వాడి భార్య, వాడి పిల్లలు, వాడి తల్లి అందరితో.... అందరితో వాడి చావు బ్రతుకు ముడిపడి వుంటాయి. కొద్దిగా ఆవేశంగా అన్నారాయన.

"నిజమే బాబాయ్! మీరు అంటున్నది నిజమే. మానవతాదృష్టితో మాట్లాడితే యిలాగే మాట్లాడాలి. ఇలాగే చేయాలి. కానీ సంఘంలో శాంతి భద్రతల మాటేమిటి? యిలా భయపడుతూ ఎంతకాలం బ్రతకడం? మనతోటి మనుష్యులనే మృగాలకు కాదు-భయపడుతూ బ్రతకడం ఎంత అవమానం? ఎంత లజ్జాకరం.

"బోస్‌బాబా! నాకు జవాబివ్వలేదు." ఆలోచిస్తున్నారు దీర్ఘంగా, సుదీర్ఘంగా.

"నేనేం చేయాలని ప్రజలు క్షణంక్షణం భయపడుతూ తమను తాము రక్షించుకునే దుస్థితినుంచి వాళ్ళను రక్షించి నిశ్చింతగా బ్రతికేలా చేయడానికి తనేం చేయాలి?" అని ఆలోచిస్తున్నట్టున్నారు.

"తమకు రాబోయే ప్రమాదాల్ని సైతం లెక్కచేయకుండా కదిలే రైళ్ళలో వేలాడుతూ దొంగతనాలు చేస్తున్న వాళ్ళ గుండెల్లో వున్న దురాశను ఎలా పోగొట్టాలా" అని ఆలోచిస్తున్నారు.

"చాలామంది నిశ్చింతగా బ్రతకడానికి కొందరిని కఠినంగా శిక్షించడం సబబైన మార్గముకాదా? అని ఆలోచిస్తున్నట్టున్నారు.

"తన డిపార్టుమెంట్‌లో, రాజకీయాల్లో వున్న కలుపుమొక్కల్ని దురాశను ఎలా ఏరిపారేయాలా అని ఆలోచిస్తున్నట్టున్నారు.

"బాబాయ్!" పిలిచినా తృళ్ళిపడ్డట్టుగా చూసి లేచారాయన.

"వస్తా పూర్ణా ! వస్తా డాక్టర్‌గారూ! నువ్వు రిపోర్టివ్వమ్మా అరుణా" అనేసి ఆయన నిశ్శబ్దంగా వెళ్ళిపోయినా ఆయనలో సంచలనం నా కర్థమయింది.

*